సాక్షి
వరంగల్
గురువారం । 13 । జూన్ । 2024



భద్రతకు పెప్‌టాక్..
రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాల నివారణకు ఎన్పీడీసీఎల్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది.
- 8లో▸



కలిసికట్టుగా పనిచేద్దాం
అందరం కలిసికట్టుగా పనిచేసి ఉమ్మడి వరంగల్ జిల్లాను అభివృద్ధి చేసుకుందామని మంత్రి కొండా సురేఖ అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
33^0 /26^0

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. రాత్రి సమయంలో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బెస్ట్ అవైలబుల్ స్కూల్ సీట్లు కేటాయింపు



కాళోజీ సెంటర్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఎస్టీ సీట్లను బుధవారం కేటాయించారు. కలెక్టరేట్ హాల్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి సమక్షంలో డ్రా తీశారు. మూడో తరగతిలో 25 సీట్లు, ఐదో తరగతిలో 13 సీట్లు, 8వ తరగతిలో 13 సీట్లను విద్యార్థులకు కేటాయించినట్లు అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. కార్యక్రమంలో డీటీడీఓ సౌజన్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్: జిల్లాస్థాయి వికలాంగుల కమిటీని ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగుల సంక్షేమానికి పాటుపడుతున్న వివిధ కేటగిరీలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. (ఎస్సీ/ఎస్టీ) వర్గానికి చెందిన అభ్యర్థి ఒకరు, ఒకరు మహిళ, ముగ్గురు మిగతా సభ్యులు, వికలాంగుల కోసం సాంకేతికంగా పాటుపడిన (ఎస్సీ/ఎస్టీ) వర్గానికి చెందిన అభ్యర్థి ఒకరు, ఒకరు మహిళ అభ్యర్థి, మిగిలిన ముగ్గురు సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన అభ్యర్థులు పూర్తి వివరాలతోపాటు వారికి సంబంధించిన ప్రశంసపత్రాలను జతపరిచి 10 రోజుల్లోగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని, మరిన్ని వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఎస్‌జీటీలు హాజరు కావాలి

కాళోజీ సెంటర్: స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పదోన్నతులకు స్పెషల్ ఎడ్యుకేషన్ బీఎడ్ (ఆర్‌సీఐ గుర్తింపు సంఖ్య పొందిన) అర్హత గల ఎస్‌జీటీలు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్ తీసుకొని డీఈఓ కార్యాలయానికి ఉదయం 10 గంటలకు హాజరు కావాలని డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో కోరారు. ఒక ఎస్‌జీటీ ఒకటి కంటే ఎక్కువ సబ్జెక్టులకు పదోన్నతికి అర్హత కలిగి ఉంటే, ఆ ఉపాధ్యాయుడు ఒక సబ్జెక్టుకు తన ప్రాధాన్యతను సమర్పించాల్సి ఉంటుందని డీఈఓ పేర్కొన్నారు.

మిషన్ భగీరథ సర్వేను త్వరగా పూర్తిచేయాలి

గీసుకొండ: మిషన్ భగీరథ సర్వేను త్వరగా పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ రాంరెడ్డి అన్నారు. మండలంలోని ఊకల్, మరియపురంలో జరుగుతున్న సర్వే తీరును బుధవారం ఆయన పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. మండలంలో 21 గ్రామపంచాయతీల్లో 9,546 కుటుంబాలను 57 మంది సిబ్బంది టీంలుగా ఏర్పడి సర్వే చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 1,408 కుటుంబాలను (15.3 శాతం) సర్వే చేశారని పేర్కొన్నారు. ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, స్వప్న, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఇక పెద్దలకూ బీసీజీ టీకా

గీసుకొండ: చిన్నారుల్లో క్షయవ్యాధి నిర్మూలనకు గతంలో బీసీటీ టీకా వేశారని, 2025 నాటికి వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించాలనే లక్ష్యంతో 18 ఏళ్ల పై బడిన వారందరికీ ఇదే టీకా వేయాలని కేంద్రం నిర్ణయించిందని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం టీకాపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయం మేరకు జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే ఈ కార్యక్రమం ప్రారంభమైందని, మలి విడత రాష్ట్రంలో త్వరలోనే ప్రారంభం అవుతుందని తెలిపారు. హెచ్ఐవీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు, మద్యపానం, ధూమపానం అలవాటు ఉన్నవారికి, పాలిచ్చే తల్లులు, గర్భిణులకు టీకా వేయవద్దన్నారు. క్షయ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య సిబ్బంది ద్వారా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. పాజిటివ్ వస్తే డాక్టర్ల సూచనల మేరకు మందులు వాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధార్‌సింగ్, ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాశ్, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ విష్ణు పాల్గొన్నారు.

రాగి తీగ చోరీ

రాయపర్తి(వర్ధన్నపేట): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి తీగ చోరీ చేసిన సంఘటన బుధవారం వర్ధన్నపేటలో చోటుచేసుకుంది. స్థానిక రైతుల కథనం ప్రకారం.. వర్ధన్నపేటకు చెందిన బొంత కొమురయ్య వ్యవసాయ భూమి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టారు. అందులోని రాగి తీగను ఎత్తుకెళ్లారు. పోలీసులు విచారణ చేపట్టారు.

ఎల్‌ఆర్‌ఎస్.. ఎందాకా..?

అనధికారిక ప్లాట్లు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్)పై అధికారులు వెంటనే దృష్టి సారించాలి. అందుకు సంబంధించిన సమాచారం సేకరించి పెండింగ్ దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి.
- ఈ నెల 7న అధికారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు..



నాలుగేళ్లుగా పెండింగ్‌లో దరఖాస్తులు
- అత్యధికంగా 'గ్రేటర్'లో 99,297... వర్ధన్నపేటలో 522 అర్జీలు
- లేఅవుట్ల క్రమబద్ధీకరణపై డిప్యూటీ సీఎం సానుకూల ప్రకటన
- దరఖాస్తులకు కదలిక.. అధికారిక ఉత్తర్వుల కోసం వెయిటింగ్

సాక్షిప్రతినిధి, వరంగల్:

అనధికార ప్లాట్లు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులు స్వీకరించింది. ఈ పథకంతో ప్రభుత్వానికి ఆదాయంతోపాటు కొనుగోలుదారుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఈ అవకాశం కల్పించింది. 2020 ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు ఆన్‌లైన్ ద్వారా ఒక్కో స్థలానికి రూ.1,000, వెంచర్లకు రూ.10 వేల చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి వరంగల్‌లోని 9 మున్సిపాలిటీల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత 'కుడా' పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ – 2020 దరఖాస్తులను పరిశీలించి అనుమతి ఇచ్చేందుకు చేసిన ప్రయత్నాలు ఆగిపోయాయి. దీంతో నాలుగేళ్లుగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. అనధికార లేఅవుట్ స్థలాల క్రమబద్ధీకరణపై ఈ నెల 7న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించిన నేపథ్యంలో ఇప్పటికైనా ఆ దరఖాస్తుల్లో కదలిక వస్తుందా? అన్న చర్చ జరుగుతోంది.

నాలుగేళ్లుగా పెండింగ్‌లో దరఖాస్తులు..
దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టి నాలుగేళ్లవుతోంది. ఎల్‌ఆర్‌ఎస్‌కు వచ్చిన దరఖాస్తుల్లో దరఖాస్తుదారు మరొకరికి విక్రయించిన ప్లాట్లు, ప్రభుత్వ భూములు, నిషేధిత జాబితాలోనివి, ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చేవి మినహాయించి, మిగిలిన వాటిని పరిశీలించి పరిష్కారానికి సిద్ధం చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా పరిధిలో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట పురపాలికలున్నాయి. వీటి పరిధిలో 1,56,078 ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు అందినట్లు సమాచారం. దరఖాస్తుదారులు రూ.15 కోట్లకుపైగా ప్రాథమిక రుసుము చెల్లించారు. వీటిలో 10,082 దరఖాస్తులను పరిశీలించినట్లు అప్పట్లో ప్రకటించిన అధికారులు.. ఆ మేరకు అనుమతి ఇవ్వలేదు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు 2020లో ఆయా పురపాలికల పరిధిలో ఉన్న రిజిస్ట్రేషన్ విలువల ఆధారంగా రుసుము వసూలు చేసి ప్రాసెస్ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. తద్వారా ఉమ్మడి వరంగల్‌లో రూ.405 నుంచి రూ.430 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈప్రక్రియ అంతా ఆగిపోగా.. ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతోనైనా దరఖాస్తులు పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాలని అధికారులను దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ఉత్తర్వులు రాగానే క్లియర్ చేస్తాం
వరంగల్ మహా నగరంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 99,297 దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాది అక్టోబర్ నాటికి 10వేల వరకు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ల్యాండ్, డ్యాకుమెంట్ వెరిఫికేషన్, అప్‌లోడ్ ప్రక్రియ పూర్తయ్యింది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ఇప్పటికే అప్‌లోడ్ చేసిన దరఖాస్తుల ఫీజుల చెల్లింపునకు అవకాశం కల్పిస్తూ, ప్రొసీడింగ్‌లు జారీ చేస్తాం. మిగిలిన దరఖాస్తులను వెరిఫికేషన్ చేస్తాం.
- వెంకన్న, సిటీ ప్లానర్, గ్రేటర్ వరంగల్

కార్పొరేషన్/మున్సిపాలిటీల వారీగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు..

జిల్లా	మున్సిపాలిటీ	ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు	పరిశీలించిన దరఖాస్తులు
గ్రేటర్ వరంగల్	కార్పొరేషన్	99,297	7,049
హనుమకొండ	పరకాల	3,182	549
వరంగల్	నర్సంపేట	5,316	77
	వర్ధన్నపేట	522	149
మహబూబాబాద్	మహబూబాబాద్	12,191	932
	డోర్నకల్	872	212
	మరిపెడ	2,598	03
	తొర్రూరు	10,239	141
జేఎస్ భూపాలపల్లి	భూపాలపల్లి	3,486	254
జనగామ	జనగామ	18,375	716

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసినా..



నాన్ లేఅవుట్ ప్లాటు క్రమద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) కోసం నేను 2020 అక్టోబర్ నెలలో ఆన్‌లైన్‌లో ప్లాటు వివరాలను నమోదు చేసి రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నా. క్రమబద్ధీకరణ త్వరగా చేయాలని రెండేళ్లుగా బల్దియా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ఏడాది క్రితం బల్దియా ఆధికారులు దరఖాస్తులను పరిశీలించి ఫీల్డ్ మీద ప్లాటును సందర్శించి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఎల్‌ఆర్‌ఎస్ విధానంపై పురోగతి లేదు.
- మంద సంతోష్, రామన్నపేట, వరంగల్

అనుమతులు ఇవ్వాలి



నేను ఖిలా వరంగల్ గ్రామ శివారు దూపకుంటరోడ్డు 891 సర్వేనంబర్‌లో 2012లో 200గ జాల ప్లాటు కొనుగోలు చేశా. ప్లాటు క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) కోసం రూ.1000 ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకున్నా. అనుమతి ఇవ్వాలని రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. 2023 ఫిబ్రవరిలో బల్దియా అధికారులు స్థలాన్ని పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఫీజు వివరాలు చెప్పలేదు. నాలుగేళ్లు కావొస్తున్నా దరఖాస్తు పెండింగ్‌లో ఉంది.
- సామల నిరంజన్, శివనగర్, వరంగల్

వరంగల్‌లోని గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వస్తున్న విద్యార్థులు



మోగిన బడిగంట..

- జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభం
- ఉత్సాహంగా తరలివెళ్లిన విద్యార్థులు
- మొదటి రోజు 40 శాతం మంది హాజరు
- స్వాగతం పలికిన ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు
- స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ
- 19 వరకు కొనసాగనున్న బడిబాట



బడిగంట కొడుతున్న అటెండర్

కాళోజీ సెంటర్: జిల్లా వ్యాప్తంగా బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మొదటిరోజు వరంగల్ నగరం, నర్సంపేట, వర్ధన్నపేటతోపాటు గ్రామాల్లో ఉత్సాహంగా విద్యార్థులు పాఠశాలలకు తరలి వెళ్లారు. ఉరుకులు పరుగులతో కేరింతలు కొడుతూ బడికి హాజరయ్యారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పూలు, బ్యాండ్‌మేళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తేవడానికి విద్యాశాఖ కృషిచేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని 672 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 556 పాఠశాలల్లోని సమస్యలను గుర్తించింది. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా రూ.24 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తికావొస్తున్నాయి. పనులు కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. మరుగుదొడ్లు, మూత్రశాలలు, బ్లాక్‌బోర్డులు, విద్యుత్, పెయింటింగ్‌తో పాఠశాలలు కళకళలాడుతున్నాయి.

40 వేల మంది విద్యార్థులకు యూనిఫాం పంపిణీ
ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ఉచితంగా అందజేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో సుమారు 40 వేల మంది విద్యార్థులకు యూనిఫాం, 2,45,890 పాఠ్యపుస్తకాలు, 46,860 వర్క్‌బుక్స్, 2,18,980 నోట్‌బుక్స్‌ను ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. కాగా, మొదటి రోజు 40 శాతం మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలలకు హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయుల కొరతతో బోధనకు ఆటంకం
జిల్లాలోని 672 ప్రభుత్వ పాఠశాలల్లో 43,865 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉర్దూ, ఇంగ్లిష్, తెలుగు మీడియంలో కలిపి 1,317 మంది ఉపాధ్యాయులకు 1,023 మంది ఉన్నారు. మరో 294 మంది ఉపాధ్యాయులు కావాలి. ఈ ఖాళీల్లో విద్యావలంటీర్లను నియమిస్తే బోధనకు ఆటంకం ఉండదు. ఇప్పటికే ఉపాధ్యాయుల కొరతతో పదో తరగతిలో 1,030 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. ఉపాధ్యాయులను నియమించకుంటే ఈసారి కూడా ఆ ఫలితాలే పునరావృతమయ్యే అవకాశం ఉందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బడిబాటతో పెరుగుతున్న విద్యార్థులు
జిల్లాలో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఈనెల 6 నుంచి నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఈనెల 19 వరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బడిఈడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలు, ద్విభాషా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫాం, మధ్యాహ్న భోజనం, దివ్యాంగ పిల్లలకు కల్పించే వసతులు, బాలికా విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు. ఐదో తరగతి పూర్తి చేసిన వారిని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో, 7, 8వ తరగతి పూర్తిచేసిన వారిని ఉన్నత పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఇప్పటివరకు బడియబట ఉన్న సుమారు 500 మంది పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించినట్లు అధికారులు తెలిపారు.



నెక్కొండలో విద్యార్థులకు పూలు అందించి స్వాగతం పలుకుతున్న ఎంపీపీ రమేశ్‌నాయక్

ముంపు శాశ్వత నివారణకు ప్రణాళికలు

- శివార్ల నుంచి వరద రాకుండా చర్యలు తీసుకోవాలి
- ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- గ్రేటర్ వరంగల్‌పై సుదీర్ఘ సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ అర్బన్: వరంగల్ నగరంలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.. అధికారులను ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. హనుమకొండలోని 'కుడా' కార్యాలయంలో వరద ముంపు, అభివృద్ధి పనులు, మొక్కల పెంపకంపై మంత్రి సురేఖ బుధవారం సమీక్ష నిర్వహించారు. గతంలో భారీ వర్షాలతో నగరంలో ముంపునకు గురైన ప్రాంతాలపై ఆరా తీశారు. 2022–23లో వరదలతో ముంపునకు గురైన ప్రాంతాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. వడ్డేపల్లి నాలా నుంచి సమ్మయ్యనగర్, నయీంనగర్, మంగళి వాగు (ఎస్సారెస్పీ కెనాల్) వరద ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బొందివాగు నుంచి పోతననగర్, మ్యూజికల్ గార్డెన్, అలంకార్ జంక్షన్, ములుగు రోడ్డు మీదుగా నాలా విస్తరణ, ఆధునికీకరణ పనులు రూ.158 కోట్లతో ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ నాలా పూర్తిస్థాయి పనులకు మరో రూ.200 కోట్ల నిధులు అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వడ్డేపల్లి చెరువు నుంచి ఊర చెరువు వరకు రూ.60 కోట్లతో డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

పునరావాస కేంద్రాలకు తరలించాలి..
ఎన్నికల నేపథ్యంలో రెండు నెలల సమయం వృథాగా అయిందని, వర్షాలు కురుస్తున్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. వరదలు వస్తే ప్రజలను ఎప్పటికప్పుడు పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. నగర శివార్ల నుంచి నీరు రాకుండా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని చెప్పారు. నగరాభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

నగరంలో పచ్చదనాన్ని పెంపొందించాలి..
నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పెద్ద ఎత్తున మొక్కలు పెంచి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ఈ ఏడాది 4.50 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. గ్రేటర్ పరిధిలో 217 కిలోమీటర్ల మేర విరివిగా మొక్కలు నాటేందుకు టెండర్ పిలిచినట్లు కమిషనర్ మంత్రికి వివరించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ కీర్తినగర్, గరీబ్‌నగర్ ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ల కోసం తవ్వకాలు పూర్తికాకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను తొలగించామని కమిషనర్ తెలిపారు. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బంది కొరత తీర్చాలని, వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా, మిషన్ భగీరథ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర అటవీశాఖ అధికారి కృష్ణ, రాష్ట్ర ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ అశోక్, నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాల కొరత లేదు..

- మార్కెట్‌లో 2.90 లక్షల ప్యాకెట్లు
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్



ఉషాదయాళ్, డీఏఓ



ఖిలా వరంగల్: జిల్లా వ్యాప్తంగా 8 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు వచ్చాయి. వీటిలో 5.10 లక్షల ప్యాకెట్లు అమ్ముడుపోయాయి. ఇంకా 2.90 లక్షల ప్యాకెట్లు మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి.. జిల్లాలో విత్తనాల కొరత లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్ తెలిపారు. ఇప్పటివరకు 75 శాతం మంది రైతులు పత్తి ప్యాకెట్లు కొనుగోలు చేశారు. రానున్న రోజుల్లో భారీవర్షం కురిస్తే మిగిలిన 25 శాతం రైతులు విత్తనాలు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఒక ప్యాకెట్ 475 గ్రాముల బరువు ఉంటుంది. ప్యాకెట్ గరిష్ఠ ధర రూ.864 ఉంది. అందుబాటులో ఉన్న హైబ్రిడ్ పత్తి విత్తనాలు దాదాపు 10 నుంచి 20 కిలోల తేడాతో ఒకేరకమైన దిగుబడి ఇస్తాయి. భూమిని బట్టి, సాగు పద్ధతి, చేపట్టే సస్యరక్షణ చర్యలతో దిగుబడిలో కొద్ది తేడాలు ఉంటాయి. ఒకేరకమైన పత్తి విత్తనాలు కొనుగోలు చేసేందుకు ప్రయాస పడకూడదని ఆమె సూచించారు.

రైతులకు అవగాహన సదస్సులు..
ఉమ్మడి జిల్లా రైతులు విత్తనాలను వరంగల్ స్టేషన్ రోడ్డులోని షాపుల్లో కొనుగోలు చేస్తుంటారు. విత్తనాల కొనుగోలు చేయడంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గుర్తించి వ్యవసాయశాఖ ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించింది.

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి.
రైతులు తప్పకుండా లైసెన్స్ కలిగిన అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. తీసుకున్న విత్తన కొనుగోలు బిల్లుపై షాపు నిర్వాహకుడు, రైతు పూర్తిపేరు, అడ్రస్, లైసెన్సు వివరాలు ఉన్నాయా లేదా చూసుకోవాలి. కొనుగోలు చేసిన విత్తనాల పంట, రకం, లాట్ నంబర్ కొనుగోలు ధర తప్పనిసరిగా బిల్లులో నమోదు చేయాలి, కొనుగోలుదారు, అమ్మకందారుని సంతకాలు తప్పనిసరిగా చేయించుకోవాలి. పంటకాలం పూర్తయ్యే వరకు బిల్లులను భద్రపర్చుకోవాలి.

విత్తన షాపులపై విస్తృత దాడులు
జిల్లా వ్యాప్తంగా విత్తనాల షాపులపై టాస్క్‌ఫోర్స్, వ్యవసాయశాఖ సంయుక్తంగా దాడులు చేస్తున్నాయి. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. పత్తి విత్తన డీలర్లు తమ షాపుల్లో రైతులకు కనిపించేలా కంట్రోల్ రూం నంబర్ , విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు ప్రదర్శించాలి.

ఎంజీఎం మార్చురీ నిర్వహణపై విచారణ

- ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలతో పరిశీలించిన డీఎంహెచ్ఓ

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రి నిర్వహణపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ప్రభుత్వం దృష్టి సారించింది. ఆస్పత్రి మార్చురీ నిర్వహణలో ఫ్రీజర్ల వెంటనే మరమ్మతులు చేయించాలని.. స్వయంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆస్పత్రిని సందర్శించిన సమయంలో ఆదేశాలు జారీ చేశారు. ఏఎంసీ చేసే కంపెనీలు స్పందించకపోతే సంబంధిత స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పినా ఎంజీఎం పరిపాలనాధికారుల నుంచి స్పందన లేదు. దీంతో విషయం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. మార్చురీ నిర్వహణపై ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలతో బుధవారం హనుమకొండ డీఎంహెచ్ఓ సాంబశివరావు సందర్శించారు. మార్చురీలో ఉన్న 15 ఫ్రీజర్లలో ఐదు ఫ్రీజర్లు మాత్ర మే పనిచేస్తున్నాయనే విషయాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. పనిచేయని ఫ్రీజర్లకు మరమ్మతులు చేయించాలని పరిపాలనాధికారులకు సమర్పించిన లేఖలను సంబంధిత విభాగాధిపతి.. డీఎంహెచ్ఓకు వివరించారు. అంతేకాకుండా శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సరిగ్గా విధులు నిర్వర్తించకపోవడం వల్ల ఆ ప్రాంతమంతా దుర్గంధం వస్తోందని తెలిపారు. మార్చురీలో ఒక్క మృతదేహం పోస్టు మార్టం చేయాలంటే రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చు అవుతుందనే విషయాన్ని సైతం అధికారులు గుర్తించారు. అనంతరం డీఎంహెచ్ఓ సాంబశివరావు, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, విభాగాధిపతి లక్ష్మణ్‌రావుతో కలిసి మార్చురీ నిర్వహణపై పూర్తిస్థాయిలో చర్చించారు. ఈ నివేదికను ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపించనున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.



మార్చురీని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ, అధికారులు

క్లుప్తంగా

'భీమునిపాదం'లో రైతుల పూజలు



జలపాతం వద్ద పూజలు చేస్తున్న రైతులు

గూడూరు : మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీ ప్రాంతంలోని భీమునిపాదం జలపాతం తొలకరి వర్షాలకు జాలువారడం ప్రారంభించింది. మృగశిర కార్తె ప్రారంభమైన నేపథ్యంలో రెండు రోజుల నుంచి చిరు జల్లులు కురుస్తుడడంతో ఎత్తైన గుట్టల నుంచి వస్తున్న నీరు భీమునిపాద జలపాతం గుండా జాలువారడం ప్రారంభమైంది. కాగా, భీమునిపాద జలపాతం నీరు సమీప భీమునిపాదం చెరువులోకి చేరుతుంది. దీంతో ఆ చెరువు ఆయకట్టు రైతులు పంటలు సాగు చేసుకుంటారు. తొలకరి వర్షాలతో జలపాతం జాలువారడం గుర్తించిన కొమ్ములవంచ గ్రామ రైతులు బుధవారం జలపాతం వద్దకు చేరుకున్నారు. ముందు స్నానం చేసి పక్కన ఉన్న శివుడు, నాగరాజు, పాపనచ్చమ్మ విగ్రహాలను అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ జలపాతం నీటితో భీమునిపాదం చెరువు నిండి పంటలు సమృద్ధిగా పండుతాయని రైతులు మైదం వెంకన్న, మద్ది నర్సయ్య, ఆలుగడ్డ భిక్షం, రాజాలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

- కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌గా రాజ్‌కుమార్



రాజ్‌కుమార్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న మల్లారెడ్డి, పక్కన అధ్యాపకులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్ల డైరెక్టర్‌గా గణితశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌పి. రాజ్‌కుమార్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. హాస్టళ్ల డైరెక్టర్‌గా ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఇటీవల రాజీనామా చేయగా, ఆయన స్థానంలో రాజ్‌కుమార్‌ను నియమించారు. ఈమేరకు బుధవారం సమ్మయ్య నుంచి రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాజ్‌కుమార్‌ను కేయూ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, అధ్యాపకులు, హాస్టళ్ల జాయింట్ డైరెక్టర్లు అభినందించారు.

అంతిమయాత్రలో తేనెటీగల దాడి




తేనెటీగల దాడితో మృతదేహాన్ని రోడ్డుపై వదిలి పారిపోయిన బంధువులు

కొత్తగూడ: అంతిమయాత్ర చేస్తున్న వారిపై తేనెటీగలు దాడి చేసిన ఘటన బుధవారం కొత్తగూడ మండలం ఎంచగూడెం గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రుద్రారపు వీరస్వామి(70) అనారోగ్యంతో మృతి చెందాడు. వీరస్వామి అంతిమయాత్ర చేస్తున్న క్రమంలో టపాసులు కాల్చారు. ఆ శబ్దానికి ఓ చెట్టుపై ఉన్న తేనె టీగలు చెదిరి అంతిమయాత్రలో పాల్గొన్న వారిని కుట్ట సాగాయి. దీంతో మృతదేహాన్ని రోడ్డుపై వదిలేసి బంధువులు పరుగులు తీశారు. తేనెటీగలు కుట్టిన వారిని 108లో నర్సంపేట ఆసుపత్రికి తరలించారు. చీకటి పడిన అనంతరం కొందరు.. వీరస్వామి దహన సంస్కారాలు నిర్వహించారు.

సులువుగా విద్యుత్ బిల్లుల చెల్లింపు

- బిల్లు కమ్ నోటీసుపై క్యూఆర్ కోడ్
- కోడ్ స్కాన్ చేసి నేరుగా చెల్లింపులు
- మేలో హనుమకొండ జిల్లాలో రూ.22.17 కోట్లు
- వరంగల్ జిల్లాలో 10.97 కోట్ల చెల్లింపులు



హన్మకొండ : విద్యుత్ బిల్లులు సులభంగా, ఇంటి వద్దనే చెల్లించే అవకాశాన్ని విద్యుత్ వినియోగదారుల ముంగిటికి టీజీఎన్పీడీసీఎల్ తీసుకువచ్చింది. ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో టీజీఎన్పీడీసీఎల్ యాప్, వెబ్ సైట్‌తో పాటు యూపీఏ ద్వారా బిల్లులు చెల్లింపు విధానాన్ని అమలు చేస్తోంది. అయితే ఆన్‌లైన్ చెల్లింపులు మరింత సులభతరం చేసేందుకు ప్రతి నెల మీటర్ రీడింగ్ నమోదు చేసి వినియోగదారులకు అందించే బిల్లు, నోటీసుపై కింది భాగంలో క్యూ ఆర్ కోడ్‌ను ముద్రించే విధానాన్ని తీసుకువస్తుంది. ఈ విధానాన్ని ముందుగా టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని హనుమకొండ జిల్లా హనుమకొండ టౌన్ ఈఆర్‌ఓ పరిధిలో ప్రయోగాత్మకంగా ఫిక్స్‌డ్ క్యూ ఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టారు. ఈ క్యూర్ కోడ్‌ను స్కాన్ చేస్తే యాప్ వస్తుంది. ఈ యాప్‌లో యూఎస్‌సీ నంబర్, లేదా సర్వీస్ నంబర్, చెల్లించాల్సిన బిల్లు మొత్తం నమోదు చేయాల్సి ఉంటుంది. దీన్ని పరిశీలించిన అనంతరం మరింత మెరుగ్గా, సులభతరంగా ఉండేల డయనమిక్ క్యూ ఆర్ కోడ్‌ను రూపొందించి నగరంలోని మట్టెవాడ సెక్షన్ పరిధిలో ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టారు. ఇక్కడ విజయవంతం కావడంతో వరంగల్ టౌన్ ఈఆర్‌ఓ పరిధి మొత్తానికి ఈ నెల నుంచి విస్తరించారు. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌ల ద్వారా క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నేరుగా బిల్లులు చెల్లించవచ్చు. త్వరలో ఎన్పీడీసీఎల్ వ్యాప్తంగా క్యూ ఆర్ కోడ్‌ను ప్రవేశ పెట్టేందుకు యాజమాన్యం సన్నాహాలు చేస్తుంది.

నేడు ఆన్‌లైన్ వినియోగం క్రమంగా పెరుగుతూ వస్తోంది. హనుమకొండ జిల్లాలో గృహ వినియోగదారుల సర్వీస్‌లు 3,10,221 ఉన్నాయి. కాగా జనవరిలో 1,46,521 మంది గృహ విద్యుత్ వినియోగదారులు రూ.14.74 కోట్లు, ఫిబ్రవరిలో 1,37,837 మంది వినియోగదారులు రూ.13.12 కోట్లు, మార్చిలో 1,24,688 మంది 14.45 కోట్లు, ఏప్రిల్‌లో మాసంలో 1,19,529 మంది రూ.16.65 కోట్లు, మేలో 1,25,668 మంది వినియోగదారులు రూ.22.17 కోట్లు ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. అదే విధంగా వరంగల్ జిల్లాలో మొత్తం గృహ విద్యుత్ సర్వీస్‌లు 2,52,188 ఉన్నాయి. ఇందులో జనవరిలో 1,05,234 మంది గృహ వినియోగదారులు రూ.9.32 కోట్లు ఆన్‌లైన్ ద్వారా బిల్లు చెల్లించారు. ఫిబ్రవరిలో 99,883 మంది రూ.8.80 కోట్లు, మార్చిలో 84,175 మంది రూ.8.79 కోట్లు, ఏప్రిల్‌లో 67,676 మంది రూ.8.58 కోట్లు, మేలో 71,367 మంది గృహ వినియోగదారులు రూ.10.97 కోట్లు ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లించారు.

ఆన్‌లైన్‌తో సులభంగా చెల్లింపు



ఆన్‌లైన్ విధానంలో విద్యుత్ బిల్లులు సులభంగా చెల్లించవచ్చు. వినియోగదారులు ఎలాంటి వ్యయ, ప్రయాలకు గురి కాకుండా ఇంటి వద్దనే విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశాన్ని ఎన్పీడీసీఎల్ కల్పించింది. ఆన్‌లైన్ చెల్లింపులపై వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తున్నాం. వీరి సంఖ్య ప్రతి నెల పెరుగుతోంది. మొబైల్ ఫోన్ ఉంటే చాలు సులభంగా బిల్లులు చెల్లించవచ్చు.

– వెంకటరమణ, హనుమకొండ ఎస్ఈ

క్యూ ఆర్ కోడ్‌తో సులభంగా..



క్యూ ఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లుల చెల్లింపు మరింత సులభతరం. మొబైల్ ఫోన్‌లోని యూపీఐ యాప్‌ల ద్వారా క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి క్షణాల్లో బిల్లులు చెల్లించవచ్చు. ప్రస్తుతం ఈ పద్ధతి వరంగల్ టౌన్ పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. త్వరలో ఎన్పీడీసీఎల్ వ్యాప్తంగా విస్తరించేందుకు యాజమాన్యం కసరత్తు చేస్తోంది. సంస్థ తీసుకువచ్చిన సాంకేతిక పద్ధతులను వినియోగదారులు వినియోగించుకుంటున్నారు.

– మధుసూదన్ రావు, వరంగల్ ఎస్ఈ

శ్యామల చెరువులో మళ్లీ నిర్మాణాలు

- అడ్డుకున్న స్థానికులు.. అధికారులకు ఫిర్యాదు
- అధికార పార్టీ నేతలే కబ్జాదారులు?



ఘటనా స్థలిలో చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు

హసన్‌పర్తి: గ్రేటర్ వరంగల్ పరిధిలోని శ్యామల చెరువులో మళ్లీ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. పక్షం రోజుల క్రితం నిర్మాణాలు చేపట్టడంతో వాటిని అధికారులు తొలగించారు. కొంతకాలం ఆగిన కబ్జాదారులు మళ్లీ రంగంలోకి దిగారు. బుధవారం పనులు చేపట్టడంతో చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిర్మాణం చేపట్టింది అధికార పార్టీకి చెందిన వ్యక్తని స్థానికులు చెబుతున్నారు. ఆయన వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఓ మండలంలో బలమైన నాయకుడిగా తెలుస్తోంది. తనకు అధికారుల అండ ఉందని బెదిరింపులకు గురిచేస్తున్నట్లు చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు.దీనిపై చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు నీటిపారుదల, రెవెన్యూ శాఖతో పాటు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకుని పనులు నిలిపివేయాలని సూచించారు. పట్టా భూమి కొనుగోలు చేసినట్లుగా సదరు వ్యక్తి చెప్పగా, పట్టా అయినప్పటికీ బఫర్‌జోన్ పరిధిలోకి వస్తుందని, ఇందులో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టొద్దని అధికారులు సూచించారు. దీంతో అతను.. అధికారులతో వాగ్వాదానికి దిగాడు. మరోవైపు అధికారులు నిర్మాణాలు తొలగించారు. ఇలానే మరికొందరు అధికార పార్టీ నేతలే అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా, చెరువులో నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నీటిపారుదలశాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

నిజామాబాద్‌కు డీలక్స్ బస్ సౌకర్యం



వరంగల్ రీజినల్ మేనేజర్ జ్యోస్తి శ్రీలత

హన్మకొండ: వరంగల్ నుంచి నిజామాబాద్‌కు డీలక్స్ బస్ సౌకర్యం కల్పించినట్లు టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జ్యోస్తి శ్రీలత తెలిపారు. ఇప్పటి వరకు ఎక్స్‌ప్రెస్ బస్ సౌకర్యం మాత్రమే ఉందని, ప్రయాణికులకు మరింత సుఖవంత ప్రయాణం అందించేందుకు డీలక్స్ బస్ నడుపుతున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ నుంచి హనుమకొండ మీదుగా 12 డీలక్స్ బస్‌లు నడుపుతున్నట్లు వివరించారు. రోజూ ఉదయం 4.15 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రతి 10 నిమిషాలకు ఒకటి చొప్పున డీలక్స్ బస్ బయలుదేరుతుందన్నారు. రాత్రి 8 గంటల తర్వాత రాత్రి 11 గంటల వరకు ప్రతి అరగంటకు ఒక బస్ ఉంటుందని తెలిపారు. వరంగల్ నుంచి 4.15, 6.00 ,6.45, 7.30, 8.00, 8.30, 9.00, 13.00, 13.45, 14.30, 15.00, 15.30, 16.00 డీలక్స్ బస్ బయలు దేరుతుందని వివరించారు. నిజామాబాద్ నుంచి 6.00, 6.45, 7.30, 8.00, 8.30, 9.00, 13.00, 13.45, 14.30, 15.00, 15.30, 16.00 డీలక్స్ బస్‌లు బయలుదేరుతాయన్నారు. వరంగల్ నుంచి నిజామాబాద్‌కు చార్జీ రూ.350, హనుమకొండ నుంచి నిజామాబాద్‌కు రూ.340, కరీంనగర్ నుంచి నిజామాబాద్‌కు రూ.230, హనుమకొండ నుంచి కరీంనగర్‌కు రూ.120 నిర్ణయించినట్లు వివరించారు. ప్రయాణికులు ఈ సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమీక్షలో ఇదేం వివక్ష

- మహిళా అధికారులను అవమానించేలా వ్యాఖ్యలు
- హనుమకొండ సర్కిల్‌లోని ఓ డివిజన్ స్థాయి అధికారి వింతపోకడలు

హన్మకొండ : విద్యుత్ శాఖలో ప్రగతిపై ప్రతి నెల నిర్వహించే సమీక్ష సమావేశాలు కొంత మంది అధికారుల తీరుతో అభాసుపాలవుతున్నాయనే ఆరోపణలున్నాయి. సొంత సంస్థలో పనిచేసే కిందిస్థాయి అధికారులతో పైస్థాయి అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో వారు చిన్నబుచ్చుకుంటున్నారు. పై స్థాయి అధికారి కావడంతో కిమ్మనకుండా ఉంటున్నారు. ఈ డివిజన్ అధికారికి ఎవరైనా అభ్యంతరం తెలిపేందుకు ప్రయత్నిస్తే వారిపై వివక్ష చూపుతాడనే ప్రచారం విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. హనుమకొండ సర్కిల్ పరిధిలోని ఓ డివిజన్ స్థాయి అధికారి తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. రెండు రోజుల క్రితం నిర్వహించిన డివిజన్ స్థాయి సమీక్ష సమావేశంలో ఓ సెక్షన్ స్థాయి మహిళాఅధికారిని రాత్రి నిద్ర పోలేదా? కండ్లు ఎందుకు ఎర్రబడ్డాయి... అంటూ ద్వంద్వార్థాలు వచ్చేలా ఆ డివిజన్ అధికారి మాట్లాడారనే ప్రచారం ఎన్పీడీసీఎల్ అధికారులు, ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఓ మహిళా అధికారి పట్ల ఈ విధంగా ఎలా మాట్లాడుతారని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఇదే సమావేశంలో ఓ ఏఈ బాగా పని చేస్తున్నాడని అభినందిస్తూ చప్పట్లు కొట్టించగా, అదే సమావేశంలో పాల్గొన్న మరో ఏఈ బాగా పని చేసే వారికి కాకుండా వేరే ఏఈకి ఉత్తమ అధికారిగా ఎలా ఎంపిక చేస్తారని అడిగితే ఆ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశాడని చర్చించుకుంటున్నారు. తానొక నాయకుడిని తనకు ఎదురేముంది అనే తీరుతో వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా సదరు అధికారి కార్యాలయంలో ఉంటే అక్కడికి వెళ్లేందుకు డివిజన్ పరిధిలోని ఆయా సెక్షన్‌లు, ఈఆర్‌ఓలో పని చేసే ఉద్యోగులు భయపడుతున్నారు. ఆయన లేని సమయం చూసి కార్యాలయానికి వచ్చి వారి పనులు చేయించుకుంటున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందజేయాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

రేగొండ(కొత్తపల్లిగోరి)/ చిట్యాల : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందజేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. బుధవారం కొత్తపల్లిగోరి మండలంలోని చెన్నాపూర్, చిట్యాల మండలంలోని నైన్‌పాక గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ల పనులను తనిఖీ చేశారు. ఈ సబ్‌స్టేషన్ల ఏర్పాటు వల్ల వినియోగదారులకు లో వోల్టేజీ సమస్య తీరి నాణ్యమైన విద్యుత్ అందడంతో పాటు, అంతరాయాలు తగ్గుతాయన్నారు. కొత్తగా నిర్మాణం చేపట్టబోతున్న ఒడితల సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు. కొత్తగా కనెక్షన్ తీసుకునే వ్యవసాయ వినియోగదారులకు యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేసి సర్వీసులను రిలీజ్ చేయాలని తెలిపారు. భూపాలపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మల్సూర్ నాయక్, డివిజనల్ ఇంజనీర్ నాగరాజు,కన్‌స్ట్రక్షన్ అండ్ ఎంఆర్టీ డివిజనల్ ఇంజనీర్ సదానందం, రేగొండ ఏఈ కనకయ్య పాల్గొన్నారు.

ఒడిశా టు ముంబై..

- రైలులో గంజాయి తరలింపు
- యువతి అరెస్ట్.. 57 కిలోల సరుకు స్వాధీనం

గార్ల: ఒడిశా నుంచి రైలులో ముంబై తరలిస్తున్న రూ.20 లక్షల విలువైన 57 కిలోల గంజాయిని పోలీసులు బుధవారం రాత్రి గార్ల రైల్వేస్టేషన్ సమీపంలో పట్టుకున్నారు. ఎస్సై ఎన్ జీనత్‌కుమార్ కథనం ప్రకారం.. ఒడిశాలోని గాజుపాటి జిల్లా రాకేశ్‌పంగ గ్రామానికి చెందిన యువతి లల్లికి తన పిన్ని 57 కేజీల గంజాయిని 3 సూట్ కేసుల్లో పెట్టి అప్పగించి ముంబైలోని ఓ వ్యక్తికి ఇచ్చి రమ్మని పంపించింది. దీంతో లల్లి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 3 సూట్ కేసుల్లో గంజాయి తీసుకొస్తోంది. ఈ క్రమంలో పోలీసులు రైలులో తనిఖీలు చేస్తున్నారు. సిగ్నల్ ఇవ్వక పోవడంతో గార్లలో కోనార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచింది. దీంతో పోలీసులకు పట్టుబడుతానేమో అనే భయంతో లల్లి 3 సూట్‌కేస్‌లు రైలు నుంచి కిందపడేసి గార్లలో దిగింది. రాత్రి సమయంలో రైల్వేస్టేషన్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు అనుమానం వచ్చి సూట్‌కేసులను తనిఖీ చేసి తెరవగా గంజాయి కనిపించింది. దీంతో లల్లిని అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయికి సంబంధించిన వివరాలు వెల్లడించింది. ఈమేరకు గంజాయి స్వాధీనం చేసుకుని లల్లిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్ జీనత్‌కుమార్ తెలిపారు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- వసతులను వినియోగించుకుని చదువుకోవాలి
- హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న కలెక్టర్

విద్యారణ్యపురి: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారని, వీటిని వినియోగించుకుని చదువుకోవాలని హనుమకొండకలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. బుధవారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా హనుమకొండలోని ప్రభుత్వ మార్కజీ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈసారి పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే పుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫామ్స్ చేరాయన్నారు. విద్యార్థులందరూ చదువుపై దృష్టి పెట్టి కష్టపడి చదువుకోవాలని కోరారు. తల్లిదండ్రులు..తమ తమ పిల్లలను రెగ్యులర్‌గా పాఠశాలలకు పంపాలన్నారు. జిల్లాలో మొత్తంగా 37వేల స్కూల్ యూనిఫామ్స్‌ను కుట్టించామన్నారు. ప్రతీ పాఠశాలలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ఎలక్ట్రిసిటీ మైనర్ రిపేర్లు పూర్తి చేశారన్నారు. డీఈఓ ఎండీ అబ్దుల్‌హై మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదువుకుని భవిష్యత్‌లో తాము అనుకున్న లక్ష్యాలు సాధించుకోవాలన్నారు. విద్యార్థి దశనంచే క్రమశిక్షణతో మెలగాలన్నారు. పాఠశాలకు రెగ్యులర్‌గా హాజరై తమకు వచ్చే సందేహాలను ఉపాధ్యాయులనుంచి నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అలువేలు మంగ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సమావేశంలో కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారిణి బి.రాధ, కార్పొరేటర్ చెన్న మధు, హెచ్‌ఎం జీవీ రామారావు, అమ్మ ఆదర్శ కమిటీల చైర్‌పర్సన్ రుద్రారపు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పారితోషికం

హనుమకొండ ప్రభుత్వ మార్కజీ హైస్కూల్‌లో టెన్త్ ఫలితాల్లో ప్రతిభను చూపిన ఇద్దరు విద్యార్థులు నాగసుహాణి, సాహిత్యలకు గతంలో పాఠశాలలో పనిచేసిన రవీందర్‌రెడ్డి రూ.5వేల చొప్పున నగదు పారితోషికం అందజేశారు. 9.8 సాధించిన జ్యోతిక, వివేక్ విష్ణుతేజలకు రూ.1,000 చొప్పున జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారిణి బి.రాధ అందజేశారు.

భద్రతకు పెప్‌టాక్..

పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలపై యాజమాన్యం ఆందోళన

- నివారణకు ప్రత్యేక చర్యలు
- రోజూ ఉద్యోగులకు భద్రతా సూచనలు, ప్రతిజ్ఞ
- ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో అమల్లోకి కార్యాచరణ



యాదవనగర్ సెక్షన్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

హన్మకొండ: రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాల నివారణకు టీజీ ఎన్పీడీసీఎల్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. ఇందులోభాగంగా ఈ నెల 10వ తేదీన సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఎన్పీడీసీఎల్ పరిధిలోని సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలకు ప్రధాన కార్యాలయంలోని ఆపరేషన్ సీజీఎం–1, సీజీఎం–2 కలిపి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని, మనుషులు, జంతువులు, పశువులు మృత్యువాత పడుతున్న ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ వీటిని నివారించాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. ఇవి తప్పుడు లైన్ క్లియర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ లోపం, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్లు, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల స్నాపింగ్‌లు వంటి అంశాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రాణాలు పోతున్నాయని పేర్కొన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించడంతోనే ప్రమాదాలు నివారించొచ్చని యాజమాన్యం, సీఎండీ వరుణ్ రెడ్డి సూచించారు.

ఉద్యోగుల్లో ఉత్సాహం, ఉత్తేజం నిండేలా ప్రసంగం

ప్రమాదాల నివారణ, భద్రతకు సంబంధించిన సందేశాలను స్పష్టంగా క్రమం తప్పకుండా కమ్యూనికేట్ చేయడానికి ప్రతి రోజు, ప్రతి సెక్షన్, ప్రతి సబ్ స్టేషన్‌లో పెప్ టాక్ నిర్వహించాలని సీఎండీ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం నుంచి డీఈలు, ఏడీఈలు, ఏఈలు సెక్షన్ వారీగా సిబ్బందితో సమావేశాలు నిర్వహించి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగనుంది. ఆపరేషన్ డీఈలు, డీఈ (టెక్), ఏడీఈ, ఏడీఏ (టెక్)లను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. వీరి పర్యవేక్షణలో పెప్ టాక్ జరుగుతుంది. పెప్ టాక్ అనగా చిన్న ప్రసంగం. ఈ ప్రసంగం ద్వారా అధికారులు ఉద్యోగుల్లో ఉత్సాహం, ఉత్తేజం నింపుతారు. భద్రతా ప్రమాణాలను రోజూ గుర్తు చేస్తారు. ఇది ఒక రకంగా రోజూ తాజా ప్రమాణాలతో శిక్షణ ఇవ్వడమే. విధుల్లోకి వెళ్లే ఉద్యోగులు వ్యక్తిగత భద్రతా పరికరాలు (పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్) వెంట ఉండేలా గుర్తు చేస్తారు. రోజూ తాము భద్రతా ప్రమాణాలు పాటిస్తామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తారు. అదే విధంగా ఉద్యోగులు అజాగ్రత్తగా వ్యవహరించకుండా పని ప్రదేశం, బ్రేక్ డౌన్లు, మరమ్మతులు, నిర్వహణ సమయంలో నోడల్ అధికారులు తనిఖీ నిర్వహిస్తారు. అవసరమైతే పని ప్రదేశాన్ని అధికారులు క్షేత్ర స్థాయిలో ముందుగా పరిశీలించి వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారు. సెక్షన్‌లో అత్యవసరంగా అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుకోవడం కూడా ఇందులో ఒక భాగం. ఉద్యోగులు ఎర్త్ డిశ్చార్జి రాడ్ వెంట ఉంచుకునేలా చర్యలు తీసుకుంటారు. సబ్ స్టేషన్‌లో హ్యాండ్ గ్లౌజ్, హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకుంటారు. ఈ మేరకు 3 ఫీట్ల హెల్త్ డిశ్చార్జి రాడ్, హ్యాండ్ గ్లౌజ్‌లను పంపిణీ చేశారు. అయితే హెల్మెట్ల కొరత ఉంది.

అందరం కలిసికట్టుగా పనిచేద్దాం

- ఉమ్మడి వరంగల్ జిల్లాను అభివృద్ధి చేసుకుందాం
- ఎంపీ కావ్య సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

మడికొండ: అందరం కలిసి కట్టుగా పని చేసి ఉమ్మడి వరంగల్ జిల్లాను అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం కాజీపేట మండలం మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిచయం, ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడారు. అధికారం ఎప్పుడు శాశ్వతం కాదని, అధికారం ఉందని అహంకారం ప్రదర్శించొద్దన్నారు. అవినీతి, అహంకారం వల్లే ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఓడించారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్య గెలుపునకు కృషి చేసిన శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కడియం శ్రీహరి మంచితనం.. తనపై నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించిన కాంగ్రెస్ కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. ఎంపీ నిధులతో నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, నగర మేయర్ గుండు సుధారాణి, సింగరాపు ఇందిర, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కూచన రవళి, నమిండ్ల శ్రీనివాస్, సాంబయ్య, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కత్తి వెంకటస్వామి, స్థానిక నాయకులు బిల్ల రవీందర్, గుర్రం అమర్‌నాథ్, వస్కుల భాస్కర్, శంకర్, లింగమూర్తి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పురోభివృద్ధికి పెద్దపీట

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి, మేయర్

ఖిలా వరంగల్: విద్యారంగ పురోభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఖిలా వరంగల్ మధ్యకోట ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈఓ వాసంతి అధ్యక్షతన విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి హాజరుకాగా, కలెక్టర్ ప్రావీణ్య, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు చేపడుతోందన్నారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలలను సెమి రెసిడెన్షియల్ స్కూల్స్‌గా చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారన్నారు. విద్యార్థులు కష్టపడి చదవాలని కోరారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక అంతరాలు తగ్గించేది విద్య అని తెలిపారు. ప్రభుత్వ బడులు నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభంరోజున 2.15లక్షల పాఠ్యపుస్తకాలు, 2.48 లక్షల నోట్ బుక్స్, 38వేల యూనిఫామ్స్ విద్యార్థులకు పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం జిల్లాలోని ఉత్తమ ఫలితా లు, ఎగ్జిబిట్స్, చంద్రయాన్ -3 ప్రయోగశాలలను సందర్శించిన విద్యార్థులను మంత్రి శాలువాతో అభినందించారు. అంతకుముందు విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్ బైరబోయిన ఉమ, మెప్మా, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌డీఎల్‌సీఈ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి ప్రారంభం.. 13 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 11, 279మంది విద్యార్థులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఎస్‌డీఎల్‌సీఈ డిగ్రీ బీఏ, బీకాం కంప్యూటర్ జనరల్ అండ్ కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ ప్రథమ, ద్వితీయ ,ఫైనల్ ఇయర్ ఎక్స్ అభ్యర్థులకు (ఇయర్‌వైజ్ స్కీం) పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్ నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎ నరేందర్ బుధవారం తెలిపారు. ఈనెల 13న (నేడు) ఫైనల్ ఇయర్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. ఈనెల 13,19,25,28, జూలై 2,5,9,13వ తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి మధ్యాహ్నం 5గంటల వరకు జరుగుతాయి. డిగ్రీ సెకండియర్ పరీక్షలు ఈనెల 14, 20, 26, 29, జూలై 3, 6, 10వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. డిగ్రీ ఫస్టియర్ పరీక్షలు ఈనెల 18, 21, 27, జూలై 1, 4, 8, 11వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. డిగ్రీ ఫస్టియర్, సెకండియర్, ఫైనల్ ఇయర్ కలిపి మొత్తం 11,279 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌తోపాటు నల్లగొండ జిల్లాలో కలిపి మొత్తం 13 పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.